
సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం : 19 : ఆగస్టు : 2024



రామయ్య చెంతకు రైలు బండేదీ!
ప్రఖ్యాత ఒంటిమిట్ట కోదండరామాలయంపై రైల్వేశాఖ చిన్నచూపు చూస్తోంది. ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలుకు కూడా హాల్టింగ్ లేకపోవడం గమనార్హం. -8లో



కృష్ణా జట్టు ఘన విజయం
కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా జట్టు ఘనవిజయం సాధించింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.300
రెండోరకం	రూ.150	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 560 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు త్రేతేశ్వరుని గిరి ప్రదక్షణ
రాజంపేట రూరల్: అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం 6గంటలకు గిరి ప్రదక్షణ చేయనున్నట్లు త్రేతేశ్వరస్వామి భక్తమండలి కమిటీ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరి ప్రదక్షణలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదం అందజేయనున్నట్లు చెప్పారు. పదక్షిణ అనంతరం భక్తుల సౌకర్యం కోసం బస్సు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక
రాయచోటి: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులు

మదనపల్లె సిటీ: బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి కరాటే,కుంగ్‌ఫూ ఓపెన్ పోటీల్లో మదనపల్లె యూత్ కరాటే క్లబ్ విద్యార్థులు సత్తా చాటారు.ఇతర రాష్ట్రాల నుంచి హాజరైన వారితో పోటీపడి 14 పతకాలు సాధించారు. వీరిలో ముహిబుల్ రహమాన్, మహమ్మద్ ఐమన్, కాలేషా మస్తాన్, చారుకేష్‌రాయల్, ప్రజ్వల్ రాయల్‌లు కటా విభాగాల్లో ప్రథమస్థానం పొందారు. ప్రీతమ్ తేజ్ ,థానాష్‌కుమార్‌రెడ్డి,ఆర్షియా అంజుమ్, హేమాన్ష్, తేజస్విని, ప్రణీత్, జైత్రమధుర్,డి.ఎల్.భానులు కటా విభాగాల్లో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఇషికా కటా విభాగంలో తృతీయ స్థానం సాధించి పతకాలు సాధించారు. వీరిని గ్రాండ్‌మాస్టర్ ఏ.ఆర్.సురేష్ అభినందించారు.

21న జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు
కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్లు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి. నారాయణరావు తెలిపారు. సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 31 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు అనకాపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు.

సబ్ రిజిస్ట్రార్ శ్యామలాదేవి సస్పెన్షన్
కడప కోటిరెడ్డిసర్కిల్: గతంలో కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన శ్యామలాదేవిని సస్పెండ్ చేస్తూ కర్నూలు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్) కల్యాణి ఉత్తర్వులు జారీ చేశారు. 2023లో కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన సమయంలో పబ్బాపురం స్థలాల రిజిస్ట్రేషన్ విషయంలో ఈమె సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత అదే ఏడాది ఆమెపై సస్పెన్షన్ ఎత్తివేసి కర్నూలు ఆస్పరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఇంతవరకు ఆమె విధులకు హాజరు కాలేదన్నారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా శ్యామలాదేవిని సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా వైవీయూ అధ్యాపకుడు
వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు కర్నూలులోని క్లస్టర్ యూనివర్సిటీకి నూతన రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు హైదరాబాద్ ఐఐసీటీలో చేసిన ఈయన సౌత్ కొరియాలోని సీయోల్ నేషనల్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ చేశారు. ప్రఖ్యాత జర్నల్స్‌లో 90 పరిశోధన పత్రాలను రాశారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గా నియమితులైన డాక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ, అధ్యాపకులు ఆయన్ను అభినందించారు.

అన్నన్నా.. ఇదేం ఖర్చు!

పేదల ఆకలి తీర్చడానికి అట్టహాసంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అన్నా క్యాంటీన్ల నిర్మాణ ఖర్చు అమ్మో...అంతనా అనిపించేలా కనిపిస్తున్నాయి.వాడుకలో ఉన్న భవనాలకు పచ్చరంగులతో హంగులద్ది, మరమ్మతులకు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని ఓ అన్నా క్యాంటీన్‌కు రూ. 32 లక్షలకుపైగా ఖర్చు పెట్టడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.జిల్లాలోని మదనపల్లెలో రెండు అన్నాక్యాంటీన్లు ప్రారంభించగా.. మరికొన్నింటిని సిద్ధం చేస్తున్నారు.

- అన్నా క్యాంటీన్ల నిర్మాణాలకు రూ. లక్షల్లో వ్యయం
- గతంలో ఉన్న వాటికే తూతూమంత్రంగా మరమ్మతులు
- రాయచోటి మాసాపేటలో రూ.32 లక్షలతో క్యాంటీన్ నిర్మాణంపై పెదవి విరుపు



రాయచోటి మార్కెట్‌యార్డు వద్ద ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటీన్



సాక్షి రాయచోటి: అధికారంలోకి వచ్చిన వెంటనే 'సూపర్‌సిక్స్'అమలు చేస్తాం అంటూ హామీ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు మాటమార్చారు.ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని..పథకాలు ఎలా అమలు చేయాలో అర్థం కావడం లేదని ప్రజలను మభ్యపెడుతున్నారు.మహిళకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగులకు భృతి, ఉచిత బస్సు ప్రయాణం, ఇలా హామీలన్నింటిని తుంగలోకి తొక్కేందుకు యత్నిస్తున్నారు.డబ్బులు లేవంటూనే మరో వైపు ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. అన్నా క్యాంటీన్ల నిర్మాణానికి రూ.లక్షల్లో వ్యయం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రూ. ల32 లక్షలు: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని మాసాపేట మార్కెట్‌యార్డులో నిర్మిస్తున్న అన్నా క్యాంటీన్‌కు సుమారు రూ. 32 లక్షలు ఖర్చుచేస్తున్నారు. గతంలో కొంతమేర నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవనానికి ప్రస్తుతం రంగులద్దారు. అయితే ఒకేసారి భారీ ఎత్తున ఒక క్యాంటీన్ నిర్మాణానికే రూ. 32 లక్షల వరకు ఖర్చు చేస్తుండడంపై ప్రజల్లో చర్చ కొనసాగుతోంది. ఇవే కాకుండా రాజంపేట ఆర్‌అండ్‌బీ వసతి గృహం వద్ద, రాయచోటి బస్టాండు వద్ద సుమారు రూ. 7.50 లక్షల వరకు ఖర్చు చేసి నిర్మిస్తున్నారు. వీటిని త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

వార్డు సచివాలయ భవనంలో అన్నాక్యాంటిన్
రాజంపేట: పట్టణంలోని పదో వార్డు సచివాలయం భవనంలో పురపాలిక అధికారులు అన్నాక్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. అంతకముందు టీడీపీ సర్కారు హయాంలో భవనాన్ని నిర్మించారు. ఇప్పుడు మళ్లీ అన్నాక్యాంటీన్ ఏర్పాటుచేయాలని వార్డు సచివాలయాన్ని అక్కడి నుంచి ఖాళీ చేయించేశారు. దాదాపు రూ.7.50 లక్షల వ్యయంతో పునరుద్ధరణ చేశారు. కేవలం రంగులు, ఎన్టీఆర్, చంద్రబాబు బొమ్మలతో పెయింటింగ్ వేసుకునేందుకు వెచ్చించారు. అనధికారికంగా పనులు చేసి, ఆపైన పురపాలిక అనుమతి పొందేందుకు తమ్ముళ్లు సిద్ధమయ్యారు. ఇంకా ఇక్కడ అన్నా క్యాంటీన్ ప్రారంభంకాలేదు.



రాజంపేటలో అన్నాక్యాంటిన్

రూ.8 లక్షలు..
రాయచోటి: టీడీపీ ప్రభుత్వం హయాంలో పట్టణంలోని అన్నాక్యాంటిన్‌లో రూ.5లకు భోజనం పెట్టారు. ఇప్పుడు మళ్లీ గోడలకు రంగులద్ది కింద దెబ్బతిన్న రాళ్లను అక్కడక్కడా మార్చి ప్రారంభానికి సిద్ధం చేశారు. భవన నిర్మాణానికి రూ.8 లక్షలు ఖర్చు చేశారు. కాంట్రాక్టర్ కోసం ఈ పని అప్పగించినట్లు స్థానికులు అంటున్నారు.



ప్రారంభానికి సిద్ధమైన అన్నా క్యాంటీన్

రూ.11.78లక్షలు
మదనపల్లె: పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మార్కెట్‌యార్డు వద్ద, సంతగేటు సమీపంలో 2018 సెప్టెంబర్ 15వ తేదీన రెండుచోట్ల అన్నా క్యాంటీన్‌లు ప్రారంభించారు. ప్రస్తుతం వీటిని తిరిగి ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో వీటికి మరమ్మతులు చేయాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. దీనికోసం ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించారు. అందులో 33వవార్డు మార్కెట్‌యార్డు సమీపంలోని అన్నా క్యాంటీన్‌కు 5లక్షల 18వేల776 రూపాయలకు మరమ్మతులు చేసేందుకు ఎస్.సయ్యద్‌సాహెబ్, 22వవార్డు సంతగేటు సమీపంలోని అన్నాక్యాంటీన్‌కు రూ.6లక్షల 30వేల997కు జి.వెంకటాచలపతి టెండర్ దక్కించుకున్నారు. అంటే రెండు క్యాంటీన్‌లకు మరమ్మతులకు 11లక్షల49వేల773 రూపాయలు ఖర్చుచేశారు. క్యాంటీన్‌లకు రంగులు వేయడం, టైల్స్ ఏర్పాటుచేయడం, వాష్‌బేసిన్‌లు, వాష్ రూమ్ రిపేరీ, విద్యుద్దీకరణ పనులు చేశారు. వీటికి అదనంగా ముందువేపు క్లాడింగ్ పనులకు ఒకో క్యాంటీన్‌కు రూ.5లక్షలు ఖర్చుచేశారు.



సంతగేటు సమీపంలోని అన్నా క్యాంటీన్

గంగమ్మా..కాపాడవమ్మా



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

లక్కిరెడ్డిపల్లి: అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించారు. తలనీలాలు అర్పించారు. వర్షాలు కురిపించమ్మా అని అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ఆలయ ప్రత్యేకాధికారి మారుతీ ప్రసాద్ భక్తులకు సౌకర్యాలు కల్పించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఫొటోగ్రఫీలో ప్రతిభ
ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఫొటోగ్రఫీ విభాగం విద్యార్థులు ఫొటోగ్రఫీ కాంపిటీషన్స్‌లో సత్తాచాటారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించి ఈ పోటీల్లో వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో బీఎఫ్ఏ ఫొటోగ్రఫీ ఫైనలియర్ విద్యార్థులు బోరెడ్డి నితీష్‌రెడ్డి రెండోస్థానం, అవుతా జ్యోతిచరణ్ మూడోస్థానంలో నిలిచారు. వీరికి ఈనెల 19న హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో బహుమతులు ప్రదానం చేయనున్నారు.





బోరెడ్డి నితీష్‌రెడ్డి తీసిన ఫొటో
(ఇన్‌సెట్) బోరెడ్డి నితీష్‌రెడ్డి

కొనసాగుతున్న జూడాల నిరసన



కడప రిమ్స్ ఆవరణలో జూనియర్ డాక్టర్స్ నిరసన





నిరసన చిత్రాలు

కడప అర్బన్: కోల్‌కతా వైద్యకళాశాలలో వైద్యురాలిపై జరిగిన అత్యాచార, హత్య ఘటనకు నిరసనగా కడప రిమ్స్ ఆవరణలో వైద్యవిద్యార్థుల నిరసన కొనసాగుతోంది. ఆదివారం తాము చేస్తున్న దీక్షా శిబిరంలో అత్యాచారం, హత్య సంఘటనలను నిరసిస్తూ చిత్రాలను గీశారు. శిబిరంలో చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్స్ నాయకులు నిఖిల్, మౌనిక, ఇతర నాయకులు మాట్లాడుతూ కోల్‌కత్తాలో మహిళా పీజీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య సంఘటనకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 19వ తేదీన (సోమవారం) నుంచి కడప రిమ్స్ ఆవరణంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభమైందన్నారు.

పశ్చిమబెంగాల్ సీఎం రాజీనామా చేయాలి
రైల్వేకోడూరు అర్బన్: పశ్చిమ బెంగాల్ మెడికల్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను ఉరితీయాలని ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి బాధ్యత వహిస్తూ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కలుగజేసుకొని నిందితులకు ఉరిశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు దేశంలో మరెక్కడా జరగకుండా కఠిన చట్టాలు తేవాలని తెలిపారు. మాజీ టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర, పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్, వి.రమణ, మల్లికార్జున, డి.రఘు, రాజ, శంకరయ్య, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వరీ, అరుణ, లక్ష్మీనారాయణమ్మ, కుప్పాల జ్యోతి పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళా కార్యకర్తలు

రాష్ట్రస్థాయి పోటీల్లో సుండుపల్లె విద్యార్థినుల ప్రతిభ




ట్రోఫీ అందుకుంటున్న పీడీలు రాధారాణి, భారతి, బాలికలు

సుండుపల్లె: ఉమ్మడి అనంతపురం జిల్లా కదిరిలో జరిగిన 46వ రాష్ట్రస్థాయి హ్యాండ్ హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్‌లో కడప జట్టు తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. జట్టు తరపున సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు ప్రతిభ కనబరిచారు. వివిధ జిల్లాల జట్లతో జరిగిన పోటీల్లో విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకున్నారు. మూడవస్థానం కోసం జరిగిన పోటీలలో కడప జట్టు శ్రీకాకుళం జట్టుతో జరిగిన పోటీలో 4-4తో సమం కావడంతో న్యాయ నిర్ణేతలు రెండు జిల్లాల జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించారు. దీంతో కడప జట్టుకు కాంస్య పతకం దక్కింది. కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ ట్రోఫీ, కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేసి క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, శ్రీ సత్య సాయి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ కుమార్, కార్యదర్శి మహేష్, కడప హ్యాండ్ బాల్ సెక్రటరీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. కడప జిల్లా జట్టులోని సుండుపల్లె, వేంపల్లి పీడీలు రాధారాణి, విజయ భారతీ, క్రీడాకారులను అభినందించారు. కడప జిల్లా జట్టులో సుండుపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన 11 మంది బాలికలు, వేంపల్లెకు చెందిన ఐదు మంది బాలికలు ఈ పోటీలల పాల్గొన్నారు.

ప్రతిమావంతులు

- చవితి వేడుకలకు వినాయక విగ్రహాలు సిద్ధం
- కౌశలం ప్రదర్శిస్తున్న రాజస్థాన్ కళాకారులు
- అడ్వాన్స్‌లు ఇచ్చి బుక్ చేసుకుంటున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు



విగ్రహానికి రంగులద్దుతున్న కళాకారుడు



సిద్ధమైన గణనాథులు

రాజంపేట టౌన్: పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా వాడవాడలా జరుపుకునే వేడుక వినాయక చవితి. ఒకప్పుడు పెద్ద నగరాల్లో జరుపుకునేవారు. ఇప్పుడు అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. దాదాపు రెండు నెలల ముందునుంచే చవితి వేడుకలకు నిర్వాహకులు సిద్ధమవుతుంటే.. ఓబొజ్జ గణపయ్యా..మా బొజ్జ నింపయ్యా అంటూ విగ్రహాల తయారీదారులు కోరుకుంటున్నారు.చవితి ఉత్సవాలు సమీపిస్తుండటంతో కళాకారులు వినాయక ప్రతిమలను ఆకర్షణీయంగా తయారు చేసేందుకు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే అనేక ప్రాంతాల్లో చవితి వేడుకల కోసం వ్యాపారులు గణనాథులను సిద్ధం చేశారు.

ఆకర్షణీయమైన రంగులపై ఆసక్తి: ఉత్సవ కమిటీ ప్రతినిధులు తమ ప్రాంతాల్లో నెలకొల్పే వినాయక ప్రతిమలు ఆకర్షణీయంగా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. కంప్యూటర్‌లో గ్రాఫిక్స్ ద్వారా విగ్రహాన్ని రూపొందించి రంగులు వేసి చూసుకొని తరువాత కళాకారులతో ఆకర్షణీయంగా తయారు చేయిస్తున్నారు. ఇందుకు మామూలు విగ్రహం కొనుగోలు చేసే ఖర్చు కంటే ఎక్కువ అవుతుంది. అయినా ఖర్చుకు కూడా వెనకాడటం లేదు.

గణపయ్యపై భారం వేసి......
జిల్లాలో గణనాథుని విగ్రహాలను రాజస్థాన్‌కు చెందిన కళాకారులు కొన్నేళ్లుగా తయారు చేస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాలకు నాలుగు నెలల ముందు నుంచే విగ్రహాల తయారీ పనులు ప్రారంభిస్తారు. ఇందుకోసం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌ను ఉపయోగిస్తారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల దుష్ఫలితాలు ఉన్నాయని ప్రతిసారి ఆయా ప్రభుత్వాలు చెబుతూనే వస్తున్నాయి. ఈ ఏడాది కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చవితి వేడుకల సందర్భంగా మట్టి విగ్రహాలనే కొలువుదీర్చాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ప్రతిమలు తయారు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు కూడా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు తయారు చేసే వారికి నోటీసులు కూడా జారీ చేశారు. దీంతో వీటిని తయారు చేసి రంగులు వేసేందుకు సిద్ధం ఉంచిన వ్యాపారులు ఆందోళను గురయ్యారు. దాదాపు నెల రోజులు కళాకారులు విగ్రహాలకు రంగులు వేయకుండా నిలిపివేశారు. వినాయక చవితి దగ్గర పడుతుండటంతో కళాకారులు, వ్యాపారులు గణపయ్యపై భారం వేసి రంగులు వేసే పనులను ముమ్మరం చేశారు.

జిల్లాలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల తయారీ


- 200 రాజస్థాన్ నుంచి వచ్చిన కుటుంబాలు :
- 30 వేలు తయారు చేసే విగ్రహాలు
- 600 మంది విగ్రహాలు తయారు చేసే కార్మికులు
- 1 నుంచి 15 అడుగులు విగ్రహాల పరిమాణం :

రంగుల విగ్రహాలనే ఇష్టపడతారు



వినాయక చవితి ఉత్సవాలు చేసేవాళ్లు రంగుల విగ్రహాలనే కొలువుదీర్చేందుకు ఇష్టపడతారు. అందువల్ల మేము చిన్నప్పటి నుంచి వీటినే తయారు చేస్తున్నాం. వినాయక చవితి పండుగకు నాలుగు నెలల ముందు నుంచి విగ్రహాల తయారీ పనులు ప్రారంభిస్తాం.వీటిని విక్రయించడం ద్వారా వచ్చే డబ్బులతో కడుపు నింపుకుంటాం. పెద్ద విగ్రహాలకు గిరాకీ ఉంది. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఇప్పటి నుంచే వినాయక ప్రతిమలను తయారు చేయిస్తున్నారు. - కృష్ణయ్య, విగ్రహ తయారీదారుడు, రాజస్థాన్

ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవాలి



గతంలో ఏ ప్రభుత్వం కూడా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను తయారు చేయకూడదని ఆదేశాలు ఇవ్వలేదు. దీంతో ఈ సంవత్సరం కూడా విగ్రహాలను తయారు చేస్తున్నాం. నెలరోజుల కిందట ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు తయారు చేయవద్దని అధికారులు నోటీసులు ఇచ్చారు. మధ్యలో ఇలాంటి నిర్ణయం తీసుకుంటే మేం నష్టపోతాం. ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవాలి.
- గోవింద్, విగ్రహతయారీదారుడు, రాజస్థాన్

క్లుప్తంగా

వానల్లు కురిపించు కప్ప దేవుడా.!


కప్ప దేవుడిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

వీరబల్లి : మండల కేంద్రంలోని ప్రజలు ఆదివారం కప్ప దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా రోకలి బండకు వేపాకు కట్టి కప్ప దేవుడిని కట్టి ఇంటింటికి వెళ్లి పూజలు చేయించారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం నుంచి సాయంకాలం వరకు నిర్వహించారు. అనంతరం కప్పను నీటిలో వదిలి పెట్టారు. వర్షం రాకపోతే ఈ విధంగా కప్ప దేవుడికి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

లంకమల అభయారణ్యంలో కూంబింగ్


సిద్దవటం రేంజ్‌లో కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీ అధికారులు, సిబ్బంది

సిద్దవటం : లంకమల అభయారణ్యం సిద్దవటం రేంజ్ పరిధిలోని కొండూరు, మద్దూరు బీట్లలో గత రెండు రోజులుగా కూంబింగ్ నిర్వహించామని రేంజర్ బి. కళావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ కొండూరు, మద్దూరు బీట్లలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఎర్రచందనం స్మగ్లర్ల కోసం తన సిబ్బందితో కలిసి కూంబింగ్ నిర్వహించామన్నారు. ఈ కూంబింగ్ సిద్దవటం రేంజ్‌లో మరి కొన్ని రోజులు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె. ఓబులేసు, బీటు ఆఫీసర్ విశ్వనాథ్, కొండూరు, మద్దూరు ఎఫ్‌బీఓలు, ఏబీఓలు, బేస్ క్యాంపు సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ


రోడ్డుప్రమాదంలో గాయపడిన వెంకటరమణ

కలకడ : రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్ర రక్తగాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దమండ్యం మండలం, మట్లివారిపల్లెకు చెందిన ఎస్.వెంకటరమణ తన ద్విచక్రవాహనంలో కలకడ నుంచి ఇందిరమ్మకాలనీవైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణ ఎడమకాలు విరిగి, శరీరంపై రక్త గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రామయ్య చెంతకు రైలు బండేదీ!

- ఆంధ్రా అయోధ్యపై కేంద్రం నిర్లక్ష్యం
- ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- రైలు సౌకర్యంపై నోరుమెదపని టీటీడీ
- పట్టించుకోని ఎన్డీఏ ప్రభుత్వం



రాజంపేట : పవిత్ర వైష్ణవ క్షేత్రాల్లో ఒకటి అన్నమయ్య జిల్లా ఒంటిమిట్టలో వెలసిన కోదండరామాలయం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు భద్రాచలం ఉండేది. ఆ స్థానంలో ఇప్పుడు ఒంటిమిట్ట కోదండరామాలయం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఒకరకంగా రైల్వేశాఖ తెలంగాణలో భద్రాచలం రైల్వేస్టేషన్‌కు ఇచ్చిన ప్రాముఖ్యతను ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌కు ఇవ్వడంలో నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోందని భక్తులు విమర్శిస్తున్నారు.

ముంబై–చెన్నై మార్గంలో నడిచే ఏ ఎక్స్‌ప్రెస్ రైలుకు కూడా ఒంటిమిట్ట స్టేషన్‌లో హాల్టింగ్ లేకపోవడం గమనార్హం. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి సర్కారు నడుస్తోంది. రైల్వేపరంగా కేంద్రం నుంచి ఒంటిమిట్ట రైల్వేస్టేషన్ అభివృద్ధి, పలురైళ్ల హాల్టింగ్‌లపై ఒరిగిందేమీలేదు. ఇలాంటి పరిస్థితిలో అమరావతితోపాటు రామాలయం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, పలు రైళ్ల హాల్టింగ్ కల్పించి, పరోక్షంగా పర్యాటకపరంగా, యాత్రికుల సౌకర్యంపై దృష్టి సారించకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. రైల్వేస్టేషన్ రాములోరి కల్యాణ వేదికకు అత్యంత సమీపంలో ఉన్నా అధికారులు ఆ దిశగా ఆలోచించకపోవడం విచారకరం.

రామాయణం వలయంలో..

రామాలయాన్ని రామాయణ వలయం పేరిట అయోధ్య, రామేశ్వరం, భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) మీదుగా భక్తుల కోసం ప్రత్యేక రైలును రైల్వేశాఖ తీసుకొచ్చింది. అయితే ఈ రైలు ఒంటిమిట్ట రామయ్య చెంతకు వచ్చే పరిస్థితులు లేవు. ఆ అవకాశం కేంద్రం కల్పించలేదు. ఇటీవల కేంద్ర మంత్రివర్గం భద్రాచలం మీదుగా కొత్తలైనుకు ఆమోదం తెలిపింది. స్వయంగా రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ భద్రాద్రి రామయ్య చెంతకు రైలుబండి వస్తుందని తాజాగా ప్రకటించడం విశేషం. మరీ ఆయన ఒంటిమిట్ట కోదండరాముని ఆలయం గురించి ఎందుకు పట్టించుకోలేదన్న విమర్శలను ఎదుర్కొంటున్నారు.

రాష్ట్రం నలుమూలల నుంచి..

శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు వివిధ జిల్లాల నుంచి ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకునేందుకు భక్తుల రాక రోజురోజుకు అధికమవుతోంది. ఒంటిమిట్టలో స్టేషన్ ఉన్నా భక్తులకు రైలు సౌకర్యం లేకపోవడంతో కడప వరకు ప్రయాణించి రోడ్డుమార్గంలో ఒంటిమిట్టకు చేరుకుంటున్నారు. సమీపంలో ఉన్న నందలూరు, రాజంపేటలో ఏ రైలుకు ఎప్పుడూ హాల్టింగ్ ఉంటుందో.. ఎప్పుడు ఎత్తివేస్తారో తెలియని దుస్థితి నెలకొంది.

రైలు సౌకర్యంపై నోరు మెదపని టీటీడీ

రాష్ట్ర రామాలయానికి రైలు సౌకర్యంపై తిరుమల తిరుపతి దేవస్థానం నోరు మెదపడం లేదన్న విమర్శలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి. రూ.100 కోట్ల మాస్టర్‌ప్లాన్‌తో ఒంటిమిట్ట కోదండరామాలయం, రాములోరి కల్యాణ వేదికను నిర్మించి వైష్ణవ క్షేత్రం రూపురేఖలు మార్చారు. అయితే ఈ క్షేత్రానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చేందుకు అవసరమైన రైలు సౌకర్యం అంశాన్ని రైల్వేశాఖకు తెలియజేయలేదు. రెండు ప్యాసింజర్ రైళ్లు తప్ప ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్‌లేదు. కనీసం రైల్వేస్టేషన్ అభివృద్ధి లేదు. ఇప్పటికైనా టీటీడీ ఈఓ రైల్వేశాఖకు ప్రతిపాదనలు చేయాలని భక్తులు కోరుతున్నారు.

భద్రాచలం తరహాలో స్టేషన్ అభివృద్ధి ఏదీ?

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న భద్రాచలం రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసిన తరహాలోనే ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలనే ఆలోచనను దక్షిణ మధ్య రైల్వే విస్మరించిందనే అపవాదును మూటగట్టుకుంది. ముంబయి–చెన్నై కారిడార్ రైలుమార్గంలో నడిచే ప్రతి రైలుకు ఒంటిమిట్టలో స్టాపింగ్ ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆధ్యాత్మిక వేత్తలు అంటున్నారు. రాష్ట్రప్రభుత్వం ఒంటిమిట్టను ఆంధ్రా భద్రాదిగా గుర్తించి, అభివృద్ధి చేస్తుంటే రైల్వేశాఖ తన వంతు పాత్రను పోషించలేదు. ఒంటిమిట్ట, భద్రాచలం రెండు పుణ్యక్షేత్రాలు దక్షిణమధ్య రైల్వేలోనే ఉండేది. భద్రాచలం స్టేషన్‌కు ఇస్తున్న ప్రాధాన్యతను ఒంటిమిట్టకు ఇవ్వడం లేదంటే వివక్షను ప్రదర్శించినట్లేనని భక్తులు భావిస్తున్నారు.

భద్రాచలం తరహాలోనే ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌కు ప్రాముఖ్యత ఇవ్వాలి



రైల్వేశాఖ భద్రాచలం రైల్వేస్టేషన్‌ను ఏ విధంగా అభివృద్ధి చేసిందో, అన్ని రైళ్లకు ఎలా స్టాపింగ్ ఇచ్చిందో అదే విధంగా ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి, దూరప్రాంతాల నుంచి భక్తులకు రైలు సౌకర్యం కల్పించాలి. స్థానిక ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డిల ద్వారా రైల్వేశాఖకు ఒంటిమిట్ట ప్రాచుర్యం తెలిసేలా నా వంతు కృషి చేస్తాను.

– ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

అన్ని రైళ్లకు స్టాపింగ్ అవసరం



అన్ని రైళ్లకు ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ఇస్తే అన్ని చోట్లనుంచి యాత్రికులు వస్తారు. రోడ్డు మార్గంలో వీలులేనివారు రైళ్లలో రామయ్య సన్నిధికి వస్తారు. ఒంటిమిట్ట రామయ్యపై కేంద్రం చిన్నచూపు చూస్తోంది. అందుకే భద్రాచలం తరహాలో రైల్వేపరంగా అభివృద్ధి చేయడం లేదు.

– సాంబయ్య, భక్తుడు, ప్రొద్దుటూరు

రాష్ట్ర రామాలయంపై రైల్వేకు ఎందుకింత చిన్నచూపు



రాష్ట్ర రామాలయం ఒంటిమిట్ట కోదండరామాలయం. టీటీడీ అభివృద్ధి చేసింది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వస్తున్నారు. కానీ రైల్వేపరంగా ఒక్క రైలు కూడా స్టాపింగ్ లేదు. రైల్వేశాఖ భద్రాచలానికి ఇస్తున్న ప్రాముఖ్యత ఒంటిమిట్టకు ఇవ్వడంలేదు.

– సుబ్బయ్య, భక్తుడు, దువ్వూరు

ఇంటిపై దాడిచేసిన 8మందిపై కేసు నమోదు

కలకడ : ఇంటిపైకి వెళ్లి దాడి చేసిన 8మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గంగాపురం గ్రామానికి చెందిన రెడ్డెయ్యనాయుడు ఈనెల 10వతేదీన వారి గ్రామదేవత విరూపాక్షమ్మ జాతరకు చాందిని బండి మొక్కుబడి తీర్చుకోవడానికి వెళుతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన బాలినేని శివయ్య కుమారుడు నాగరాజ ద్విచక్రవాహనం తగిలించి నానా దుర్భాషలాడాడు. మరుసటి రోజు అదే గ్రామానికి చెందిన ప్రసాద్, వెంకటేశ్వర, గౌతమ్, చంద్రయ్య, వెంకటేశ్వర, ద్వారక, తిరుపతి తదితరులు వారి ఇంటిపైకి రాళ్లు, కర్రలతో దాడి చేశారని బాధితుడు రెడ్డెయ్యనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం ఎస్‌ఐ రామాంజనేయులు కేసు నమోదు చేశారు.

పిచ్చికుక్కల స్వైర విహారం

30 మందికి గాయాలు


చికిత్స పొందుతున్న బాధితులు

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లా కోడూరు మేజర్ పంచాయతీలోని పగడాలపల్లి, గాంధీనగర్, రంగనాయకులపేట, బాలానగర్, రెడ్డివారిపల్లి గ్రామాల్లో ఆదివారం పిచ్చికుక్కలు స్వైర విహారం చేశాయి. కుక్కల దాడిలో 30 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో జస్విక, సురేంద్ర, రామ్‌చరణ్, నారాయణరెడ్డి, నిశాంత్‌రెడ్డి, శ్రీనివాసులు, రమేష్‌నాయుడు, సురేంద్ర ఉన్నారు. వీరందరికీ వైద్యాధికారి బ్రహ్మకుమారి చికిత్స అందించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నా పంచాయతీ అధికారులు దృష్టి పెట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తల్లీబిడ్డల మృతిపై అనుమానాలు నివృత్తి చేయండి

నిజ నిర్ధారణ కమిటీ డిమాండ్


సంఘటనపై స్థానికులను విచారిస్తున్న నిజనిర్ధారణ కమిటీ సభ్యులు

రాయచోటి అర్బన్ : రాయచోటి పట్టణం బోస్‌నగర్‌లోని తొగటవీధిలో శనివారం తెల్లవారుజామున ఎర్రగుడి రమాదేవి, ఆమె ఇరువురు పిల్లలు మృతి చెందిన ఘటనపై అనుమానాలను నివృత్తి చేయాలని నిజ నిర్ధారణ కమిటీ డిమాండ్ చేసింది. తల్లీబిడ్డల మృతిపై పౌరహక్కుల సంఘం, ప్రజాస్వామ్యహక్కుల పరిరక్షణ సంస్థ, ఎమ్మార్పీఎస్, రజక సంఘం సభ్యులతో ఏర్పడిన నిజనిర్ధారణ కమిటీ ఈ సంఘటనపై విచారణ జరిపింది. అనంతరం ఆయా సంఘాల ప్రతినిధులు విలేకరులతో మాట్లాడారు. రమాదేవి తన ఇరువురు బిడ్డలను ముందుగా చంపిన తర్వాత ఆమె ఇంట్లో గ్యాస్‌లీక్ చేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు ముందుగానే నిర్ధారణకు వచ్చి మృతురాలిపైనే హత్య కేసు నమోదు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. రమాదేవి ఆత్మహత్య చేసుకున్నది నిజమైతే ఆమె మృతదేహం పక్కనే ఒక ప్లాస్టిక్ బాటిల్ ఏమాత్రం కాలకుండా ఉండడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆ బాటిల్‌పై ఉన్న వేలి ముద్రలు ఎవరివో తెలుసుకోవడానికి పోలీసులు ప్లాస్టిక్ బాటిల్‌ను వేలి ముద్రల నిపుణులకు పంపకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోందన్నారు. నిజంగానే రమాదేవి బెడ్‌రూంలో గ్యాస్ లీక్ చేసుకుని చనిపోయి ఉంటే అదే రూములోని బెడ్‌కాని, ఇతర వస్తువులు కాని ఎందుకు అగ్నికి ఆహుతి కాలేదన్న అనుమానాలు ఉన్నాయన్నారు. ఇంట్లోనుంచి పొగవచ్చిన వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా ఏమాత్రం కదలకుండా పడి ఉన్న శవాలను చూశామని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారన్నారు. ఈ సంఘటనకు నాలుగైదు గంటల ముందు రమాదేవికి అదేవీధిలోని మరొక మహిళతో ఘర్షణ జరిగిందని వీధి వాసులు తమకు తెలిపారన్నారు. ఘర్షణకు దిగిన మహిళ భర్తకు మృతురాలు లక్షలాది రూపాయలు అప్పుగా ఇచ్చినట్లు, ఇటీవల కాలంలో ఆ సొమ్మును తిరిగి చెల్లించాలంటూ మృతురాలు గట్టిగా ఒత్తిడి తెచ్చినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఇన్ని వరుస సంఘటనల నేపథ్యంలో రమాదేవిది ఆత్మహత్య అని పోలీసులు చెబుతుండటం నమ్మశక్యంగా లేదన్నారు.. సమావేశంలో కమిటీ సభ్యులు సి. వెంకటేశ్వర్లు, టి.ఈశ్వర్, రామాంజనేయులు, రవిశంకర్, పి.రెడ్డెయ్య, మోటపోతుల రవిశంకర్, ఇర్షాద్, రమేష్‌బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు. తల్లీ బిడ్డల మృతిపై అనుమానాలను వెంటనే నివృత్తి చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి శేఖర్ డిమాండ్ చేశారు.

కృష్ణా జట్టు ఘన విజయం


153 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన విశాఖ బ్యాట్స్‌మన్ పరమ్‌వీర్‌సింగ్


148 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన కృష్ణా బ్యాట్స్‌మన్ రాజేష్


136 పరుగులు చేసిన కృష్ణా బ్యాట్స్‌మన్ వరుణ్ సాత్విక్


5 వికెట్లు తీసిన నెల్లూరు బౌలర్ హమీద్


5 వికెట్లు తీసిన కృష్ణా బౌలర్ గీత్


122 పరుగులు చేసిన శ్రీకాకుళం బ్యాట్స్‌మన్ థామస్ రామ్‌కుమార్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా జట్టు ఘనవిజయం సాధించింది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 221 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కృష్ణా జట్టు 73.5 ఓవర్లలో 340 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని టి. వరుణ్ సాత్విక్ 139 బంతుల్లో 136 పరుగులు చేశాడు. ఈయనకు జతగా రాజేష్ 148 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. నెల్లూరు బౌలర్లు హమీద్ 5, లోకేష్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 29.3 ఓవర్లలో 134 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని హమీద్ 31 పరుగులు, మన్విత్‌రెడ్డి 22 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్లు గీత్ 5, యశ్వంత్ 3 వికెట్లు తీశారు. దీంతో కృష్ణా జట్టు ఇన్నింగ్స్, 97 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 109 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

విశాఖ జట్టుకు ఆధిక్యం..

వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 72 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన విశాఖ జట్టు 103 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 394 పరుగులు చేసింది. జట్టులోని ఈశ్వర్ రిత్విక్ 70, యువన్ 80 పరుగులు చేయగా, పరమ్‌వీర్ సింగ్ 153 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈయనకు జతగా కేపీఎస్ ప్రసాద్ 83 పరుగులతో క్రీజులో ఉన్నాడు. దీంతో విశాఖ జట్టు 188 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 206 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

హోరాహోరీగా చిత్తూరు, శ్రీకాకుళం మ్యాచ్..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 79 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన శ్రీకాకుళం జట్టు 86 ఓవర్లలో 356 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని థామస్ రామ్‌కుమార్ 122 పరుగులు చేయగా, సుశాంత్ 53 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు బాలాజీ 4, సాయి హర్షిత్‌రెడ్డి 4 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 13 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 49 పరుగులు చేసింది. జట్టులోని ఎం. హర్షసాయిరెడ్డి 19 పరుగులు, చరణ్‌జీత్ 28 పరుగులతో క్రీజులో ఉన్నారు. కాగా చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 289 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. రెండోరోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు 18 పరుగుల వెనుకంజలో ఉంది.

భర్త, అత్తమామల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన అర్షియా

వాల్మీకిపురం : భర్త, అత్తమామ, ఆడబిడ్డ వేధింపులు తాళలేక ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకొంది. సీఐ ప్రసాద్ బాబు, ఎస్‌ఐ శ్రీహరి కథనం మేరకు వివరాలు.. పట్టణానికి చెందిన అమీర్‌జాన్ కుమారుడు వసీమ్ అక్రమ్ పీలేరు పట్టణానికి చెందిన మల్లెల రెడ్డిబాషా కుమార్తె అర్షియా (22)ను ఏడాదిన్నర క్రితం ఫేస్‌బుక్ ద్వారా ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. పెళ్లయిన మూడు నెలలకు వసీమ్ అక్రమ్ సౌదీకి వెళ్లిపోవడంతో అర్షియ తన అత్త, మామ, ఆడబిడ్డలతో కలసి ఉంటోంది. ఈ క్రమంలో భర్త వసీమ్ అక్రమ్‌తో పాటు, అత్త, మామ, ఆడబిడ్డ అర్షియాను మానసికంగా, శారీరకంగా చిత్రహింసలకు గురి చేస్తుండడంతో మనస్థాపం చెందిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి


ఆమంచి రాజమ్మ (ఫైల్)

కురబలకోట : మండలంలోని పిచ్చలవాండ్లపల్లె గ్రామం, పందివానిపెంటకు చెందిన ఆమూరి రాజమ్మ (65) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు.. ఆమూరి రాజమ్మకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరు వృత్తి, ఉద్యోగాల్లో నగరాల్లో స్థిరపడ్డారు. ఇంటి వద్ద ఆమె ఒంటరిగా ఉంటోంది. ఈమె కష్టజీవి కావడంతో ఊరి వారితో పాటు వ్యవసాయ కూలి పనులకు వెళ్లేది. ఈ నేపథ్యంలో ఆదివారం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు వెళ్లి పరిశీలించారు. ఆమె కుళ్లిన స్థితిలో శవమై కన్పించింది. పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి ఒంటిపై ఉన్న బంగారు కమ్మలు లేకపోవడంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటి తలుపులతో పాటు గేటు కూడా తెరిచి ఉన్నాయి. ఎవరో బంగారు నగల కోసం ఆమెను చంపి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసు మిస్టరీని ఛేదిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

ఏపీఎండీసీ విధానాలపై నిరసన

రైల్వేకోడూరు అర్బన్ : మంగంపేట గనులలో గత నాలుగు నెలలుగా ముగ్గురాయి ఎగుమతులు లేకుండా తీసుకొన్న ఏపీఎండీసీ విధానాలపై 18 చక్రాల లారీ ఓనర్లు, డ్రైవర్లు ఆదివారం నిరసన తెలిపి ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి వినతి పత్రం పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగంపేటను నమ్ముకొని వందలాది లారీలు ఉన్నాయని, వీటి ద్వారా ఎగుమతులు చేస్తూ 10వేలమంది వరకు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. సంస్థ ఎగుమతులు నిలిపి వేయడం వల్ల ఓనర్లు, కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లారీ యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గుర్రంకొండ మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన అమీర్(60) కుటుంబ సమస్యల కారణంగా కొడుకుతో గొడవ పడ్డాడు. మనస్థాపం చెంది ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే విధంగా నిమ్మనపల్లె మడంలం కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజీవారిపల్లెకు చెందిన భగవాన్ భార్య పల్లవి(20) కుటుంబ సమస్యతో భర్తతో గొడవ పడింది. మనస్థాపం చెంది ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మ్యాంగో డ్రింక్‌లో పురుగులు


జ్యూస్ బాటిల్‌లో పురుగులు ఉన్న దృశ్యం


వీరబల్లి : వీరబల్లి మండలం, ఓదివీడు గ్రామం కుమ్మరపల్లిలో ఓ దుకాణదారుడు కాలం చెల్లిన, పురుగులు పడిన మ్యాంగో జ్యూస్‌ను అమ్ముతున్నాడు. ఆదివారం ఉదయం పిల్లలు జ్యూస్ కావాలని దుకాణం వద్దకు వెళ్లి మ్యాంగో జ్యూస్ ప్యాకెట్లు దుకాణదారుని వద్ద నుంచి కొనుగోలు చేశారు. తాగగా జ్యూస్ చేదుగా ఉండటంతో గ్లాస్‌లో వేసి పరీక్షించగా అందులో మొత్తం పురుగులున్నాయి. ఇదేంటని దుకాణదారున్ని ప్రశ్నిస్తే మాకేం తెలుసు, మాకు ఇవే సప్లై చేస్తున్నారు, మేము అమ్ముతున్నాము అంటూ బదులిచ్చారు. ఇలాంటి జ్యూస్‌లను తాగితే పిల్లల పరిస్థితి ఏంటని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన డ్రింక్స్ విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు


గాయపడిన ఫరీదా

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం పట్టణం కక్కలపల్లె మంగళ కాలనీకి చెందిన వృద్ధురాలు (90) నరాల సంబంధిత వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఆయుర్వేద చికిత్స కోసం ఆమె ఇంట్లో పని చేసే ఫరీదా(45), బంధువు నూర్ అహ్మద్, టవర్‌క్లాక్ గుల్లార్‌పేటకు చెందిన అస్లాం(54)తో కలిసి చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం విరూపాక్షపురానికి కారులో వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మదనపల్లె పట్టణం పుంగనూరు రోడ్డులోని వై.జంక్షన్ వద్ద, సీటీఎం నుంచి పుంగనూరుకు పైపుల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఎదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, ఫరీదా, అస్లాం తీవ్రంగా గాయపడ్డారు. వారితో పాటు బి.కొత్తకోటకు చెందిన బొలేరో వాహన డ్రైవర్ రామాంజి(33) గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీ కొని..


తీవ్రంగా గాయపడిన వినయ్‌కుమార్

వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులు రోడ్డు ప్రమాద ఘటనలో గాయపడ్డారు. మదనపల్లె పట్టణం కమ్మవీధికి చెందిన వినయ్‌కుమార్(38) బెంగళూరులో స్టాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ తిరుపతిలో నివసిస్తున్నాడు. ఆదివారం మదనపల్లెలోని ఇల్లు బాడుగకు ఇచ్చేందుకు వచ్చాడు. అనంతరం ఎస్‌బీఐ కాలనీలో ఉన్న స్నేహితుడు నాగేంద్రకుమార్(37)తో కలిసి ద్విచక్రవాహనంలో బెంగళూరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని చీకలబైలు పంచాయతీ తాళ్లరెడ్డి గెస్ట్‌హౌస్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వినయ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

ఇనుప రేకులు పడి కార్మికుడికి..


తీవ్రంగా గాయపడిన బీహార్ కార్మికుడు సికిందర్

మదనపల్లె : జాతీయరహదారి పనుల్లో భాగంగా పని చేస్తున్న కార్మికుడిపై ప్రమాదవశాత్తు ఇనుప రేకులు పడటంతో తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. బీహార్ రాష్ట్రానికి చెందిన సికిందర్(32) సీటీఎం వద్ద ఉంటూ జాతీయ రహదారి పనులు చేసే మేస్త్రీగా ఉంటున్నాడు. ఆదివారం పనుల్లో భాగంగా ఇనుపరేకులను పైనుంచి కిందకి దింపుతుండగా ప్రమాదశాత్తు జారి మీద పడ్డాయి. ప్రమాదంలో సికిందర్ తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని దంపతులకు..


రోడ్డుప్రమాదంలో గాయపడిన దంపతులను 108 వాహనం ద్వారా ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

గుర్రంకొండ : గుర్తు తెలియని వాహనం ఢీకొని దంపతులకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ సూరప్పగారిపల్లె వద్ద జరిగింది. చిన్నమండెం మండలం కేశాపురానికి చెందిన కె.శంకర(45), కె. సాలమ్మ(39)లు గుర్రంకొండ పంచాయతీ సుంకరవాండ్లపల్లెలోని తమ బంధువుల ఇంటికి గత శనివారం సాయంత్రం వచ్చారు. ఆదివారం తిరిగి తమ స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మార్గమధ్యంలో సూరప్పగారిపల్లె మిట్ట వద్దకు చేరుకోగానే రాయచోటి వైపు వెళుతున్న ఓ గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో దంపతులిద్దరికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. బాధితుల్ని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ మధురామచంద్రుడు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.